# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

బుధవారం
25 సెప్టెంబరు
2024
పేజీలు 8

## గుంటూరు పల్నాడు





## ఆ గురుకులంలో ఉండలేం...

# విద్యార్థుల గగ్గోలు..

### అయ్యావార్ల తీరుపై స్టూడెంట్స్ ఆగ్రహం

- ఫెన్సింగ్ దూకి కొండపైకి జంప్
- 40 మంది విద్యార్థుల తెంపరితనం
- టీచర్లు కొడుతున్నారు.. బూతులు తిడుతున్నారు
- అన్నం కూడా అస్సలు బాగుండడం లేదు
- వంకాయలపాడులోని గురుకుల విద్యార్థుల ఆవేదన
- రంగంలోకి పోలీసులు.. స్టూడెంట్స్‌కి ఊరడింపు

టీచర్లు, ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేక పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి 40 మంది పదో తరగతి విద్యార్థులు సోమవారం ఉదయం పారిపోయారు. మిగతా విద్యార్థులు సోలార్ ఫెన్సింగ్ గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేయగా సిబ్బంది పట్టుకున్నారు. ఈ సమాచారంతో పోలీసులు, సంక్షేమ శాఖ అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టారు.







**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో, నేటి దినపత్రిక సూర్య :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 3 నుంచి 10 వ తరగతి వరకు సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. పదో తరగతి చదువుతున్న 67 మంది విద్యార్థులందరూ సోమవారం ఉదయం సోలార్ ఫెన్సింగ్తో ఉన్న గోడను దూకి పారిపోయే ప్రయత్నం చేశారు.

**మరుగుదొడ్లు కడిగిస్తున్నారు..** వసతి గృహంలో సౌకర్యాలు సరిగా లేవని, అన్నం బాగోలేదు. ఆటలు ఆడించటం లేదు. మరుగుదొడ్లు కడిగిస్తున్నారు. అని విద్యార్థులు ఆరోపించారు. ప్రతి రోజూ స్లిప్ టెస్టులు పెడుతున్నారు. అన్ని సబ్జెక్టులు ఒకేసారి

**మిగతా 3లో..**

# బ్యాంకర్లు వార్షిక ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి

### బ్యాంకర్ల సమావేశంలో ఆదేశించిన కలెక్టర్
### ప్రాధాన్యతల వారీగా రుణ ప్రణాళిక సిద్ధం చేయాలి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో** జిల్లాలో బ్యాంకర్లు వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలు మేరకు ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు సక్రమంగా రుణాలను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎస్.ఆర్.శంకరన్ మినీ హాల్లో జరిగిన బ్యాంకర్ల జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి రివ్యూ కమిటీ ( డీఎల్ ఆర్ సీ) సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , అసిస్టెంట్ కలెక్టర్ పొవర్ స్వప్నిల్ జగన్నాథ్ తో కలిసి పాల్గొన్నారు. సమావేశంలో అజెండాకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళిక మొదటి త్రైమాసికంలో ప్రాధాన్యత , ప్రాధాన్యేతర రంగాలకు కేటాయించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలను మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఆగస్టు చివర సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు , వరద ముంపు వలన వ్యవసాయ , ఉద్యాన పంటలతో పాటు పశు సంవర్ధక , మత్స్య , చేనేత రంగాలకు నష్టం వాటిల్లిందని , వరద ముంపు వల్ల చాలా ప్రాంతాల్లో ఇల్లు దెబ్బతిన్నాయన్నారు. వరద ముంపును ఎస్ఎల్బీసీ ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించినందున ఆర్బిఐ నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం వ్యవసాయ , వ్యక్తిగత , వాణిజ్య రుణాలను బ్యాంకర్లు రీ షెడ్యూల్, రీస్టెక్చరింగ్ చేయాల న్నారు. దీని కోసం బ్యాంకర్లు ప్రభుత్వం వరద ముంపు పరిహారం మంజూరు చేసిన కుటుంబాల వివరాలను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు బ్యాంకర్ల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పంట రుణాలు ఖచ్చితంగా మంజూరు చేయాలన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో ఆమోదించిన దరఖాస్తుదా రులకు వెంటనే రుణాలను అందించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు వ్యాపారాలు ఏర్పాటుకు, గృహ నిర్మాణాలకు , ఉన్నత విద్యకు అత్యధిక ప్రాధాన్యతిస్తు బ్యాంకర్లు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీ కన్వీనర్ మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ , డిజియం ఎస్. జవహర్ , లీడ్ బ్యాంక్ మేజెజర్ మహిపాల్ రెడ్డి , ఆర్ బి ఐ మేనేజర్ ఏ. నాగ ప్రవీణ్ , పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్ , ఏ.డి మత్స్య శాఖ గాలిదేముడు, ఎస్ ఎస్ సిసిఐ రీజనల్ హెడ్ పరిమళ , బ్యాంకుల సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

### వరద బాధితుల సహాయార్థం, సీఎం రిలీఫ్ ఫండ్ కి, తెనాలి ఐఎంఏ విరాళం



**తెనాలి టౌన్ న్యూస్:** రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ తరపున,2,51,000/- విరాళం ప్రకటించారు. ఈ మేరకు, అసోసియేషన్ సభ్యులు, ముఖ్యమంత్రి చంద్రబాబు కి చెక్కు అందించారు. ఈ కార్యక్రమం లో, డాక్టర్ జె. విజయలక్ష్మి, డాక్టర్ వి. పావని ప్రియాంక, డాక్టర్ కే. అనిల్, డాక్టర్ కే. శ్యాం ప్రసాద్, మాజీ మునిసిపల్ చైర్మన్ పెండేల వెంకటరావు,తాతా శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

### పురందేశ్వరి నియామకం పట్ల బీజేపీ సీనియర్ నేత హర్షం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, రాజమండ్రి పార్లమెంటు సభ్యులు. దగ్గుబాటి పురందేశ్వరిని బిజెపి ప్రభుత్వం కామన్ హెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ప్రతినిధిగా, మహిళా పార్లమెంటేరియన్ స్టీరింగ్ కమిటీ చైర్ పర్సన్ గా కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ పురందేశ్వరిని కేంద్రంలో మంచి పదవిలో నియమించడంతో బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ కె భగవాన్ దాస్ మంగళవారం అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు పలువురు జిల్లా బిజెపి నాయకులు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని.. కేంద్ర ప్రభుత్వం కీలక పదవిలో నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## నామినేటెడ్ పదవుల్లో, పట్టణానికి చెందిన ఇరువురు నేతలు ఎంపిక




**తెనాలి టౌన్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు, పట్టణా నికి చెందిన, ఇరువురు సీనియర్ నేతలు దక్కించుకున్నారు. రూరల్ మండల గ్రామం, సోమసుంద రపాలెం కి చెందిన, తెనాలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేశన కోటేశ్వరరావును, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సభ్యుడి గా నియమితులయ్యారు. అలాగే మరొక తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పట్టణానికి చెందిన, జొన్నదుల మహేష్ ను, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కమిటీ సభ్యునిగా నియమింపబడ్డారు. కీలక నేతలకు, రాష్ట్ర స్థాయి పదవులు, పొందిన నేపథ్యంలో, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## వైకుంఠపురం ఆలయానికి నూతన, కమీషనర్ నియామకం



**తెనాలి మేజర్ న్యూస్ :** తెనాలి పట్టణం లోని, వైకుంఠపురం లో కొలువైవున్న, శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి, నూతన అసిస్టెంట్ కమిషనర్ గా అనుపమ నియమితులయ్యారు. ఈమె జిల్లాలో దేవాదాయశాఖ లో సహాయ కమిషనర్ గా పనిచేస్తూ, బదిలీ పై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన, గ్రంధి మాధవి నేడు రిలీవ్ అయ్యారు.

## అగతవరప్పాడు లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** వంద రోజుల పాలన లో కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజా సంక్షేమ నిర్ణయాలను ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సూచనల మేరకు పెదకా కాని మండలం ఆగతావరప్పాడు గ్రామం సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ ఈ వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించే కార్యక్రమం ఆగతావరప్పాడు గ్రామం సచివాలయం పరిధిలో భవాని పురం ఏరియాలో మంగళవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పొన్నూరు నియోజకవర్గం కో ఆర్డినేటర్ మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ళ శ్రీనివాసరావు గోళ్ళ ప్రభాకరరావు దేరంగుల శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి హరిబాబు మరియు గ్రామంలోని తెలుగుదేశం-జనసేన - బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో స్వచ్ఛతా హి సేవా



**మంగళగిరి మేజర్ న్యూస్:** మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్నాయి. మంగళ వారం మంగళగిరి ఆత్మకూరు మెయిన్ రోడ్డు నుండి పారిశుధ్య ,పరిసరాల పరిశుభ్రత పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వీపింగ్ మెషిన్ తో రోడ్లను శుభ్ర పరుచుట,గడ్డి కోత, వంటి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటం వడ్డెర పాలెం లో అధిక మొత్తములో ఉన్న డంపింగ్ యార్డును పూర్తిగా చెత్తను తరలించి, బ్లీచింగ్ చల్లించారు. అక్టోబర్ 2వ తేదీ వరకూ నగర పాలక సంస్థ వారి ఆద్వర్యం లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు. వార్డులలో ఆరోగ్య సంరక్షణ సేవలు, బ్లీచింగ్, దోమల నివారణ, మందుల పిచికారీ, డంప్ల తొలగింపు, మొక్కల పెంపకం, పార్క్ లను శుభ్రపర్చడం వంటి తదితర కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. విద్యుత్, నీరు ఆదా, ప్లాస్టిక్ నిరోధం, తాగునీరు క్లోరినేషన్ చేయడం, ఆరోగ్యకరమైన జీవితం, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని కమీషనర్ అలిం బాషా తెలిపారు.

## ఎపిఎస్పి 6వ బెటాలియన్ లో వైద్య శిబిరం



**మంగళగిరి మేజర్ న్యూస్:** మంగళగిరి ఏపీఎస్పి 6వ బెటాలియన్‌లో మంగళ వారం అమరావతి ఐ హాస్పిటల్ & దుహిత మల్టీస్పెషల్టి డెంటల్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం ను ఆరవ బెటాలియన్ కమాండెంట్ కె నగేష్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వైద్య శిబిరంలో బెటాలియన్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కంటి , పంటి సమస్యల ను పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ ఇన్చార్జ్ అడిషనల్ కమాండెంట్ కే వెంకటేశ్వరరావు అసిస్టెంట్ కమాండెంట్ డి వెంకటేశ్వరరావు, అమరావతి ఐ హాస్పిటల్ దుహిత మల్టీ స్పెషాలిటీ డెంటల్ సెంటర్ డాక్టర్ వేణు నాదెళ్ల, డాక్టర్ శైలజా కేతినేని, బెటాలియన్ యూనిట్ డాక్టర్స్ వివి భాస్కర్, డాక్టర్ గౌతమి బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసంనూతన యాప్‌ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల




**తెనాలి మేజర్ న్యూస్ :** తెనాలికి పట్టణ ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించే దిశగా నూతన యాప్ ప్రారంభించడం జరిగిందని. ఈ యాప్ ద్వారా 11 ప్రభుత్వ శాఖల్లోని సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరికి 24 గంటలు ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండటం కోసం, 365 రోజులు ప్రజల తమ సమస్యలను ఉన్నత అధికార దృష్టికి తీసుకు వెళ్లే విధంగా ఈ యాప్‌ని తెనాలి పట్టణప్రజలు ఉపయోగించుకోవాలని. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తెనాలి మున్సిపాలిటీలోని పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, రోడ్ల మరమ్మత్తులు, సిబ్బంది కొరత, వీటికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు వెంటనే ఈ యాప్ ద్వారా తమ సమస్యలు తెలపాలని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా, విజయవాడ వరద ప్రాంతాల్లో, సహాయక చర్యల్లో పాల్గొన్న, పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులకు, నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమం లో, సబ్ కలెక్టర్ సంజన సిన్హా, మునిసిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కమీషనర్ బి. శేషన్న, ఇతర పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## వివిఐటి ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల "స్వచ్ఛత హీ సేవ"



పెదకాకాని మేజర్ న్యూస్ : వివిఐటి కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన" స్వచ్ఛత హీ సేవ " కార్యక్రమము నంబూరు గ్రామ పంచాయతీలో నిర్వహించారు. పర్యవరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వంటి వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, కాలుష్యరహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని లక్ష్యంతో గ్రామంలో క్లాత్బ్యాగ్స్ ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుండి 23వరకూ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి మూడుకేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి నంబూరు పంచాయతీకి అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేదం వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలి నిర్వహించారు. గ్రామంలోని అంబేత్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచారు. ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలో మానవహారం నిర్వహించి గ్రామస్థులచే స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమములో గ్రామ పంచాయతీ సెక్రటరీ మహ్మద్ లుత్ఫాన్ సాధిక్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అఫీసర్ డాఎ ఐ.ఎల్.జె భక్తసింగ్, టి.విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి కి గురుకుల గెస్ట్ ఉపాధ్యాయుల విరాళం



**తాడికొండ, మేజర్ న్యూస్ :** డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల గెస్ట్ ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి సహాయ నిధికి వరద బాధితుల సహాయార్థం లక్ష రూపాయలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ లోనిడాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్స్ విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రిని కలిసి లక్ష రూపాయలు, డి డి రూపంలో సీఎం రిలీఫ్ ఫండ్ కు, బి ఆర్ అంబేద్కర్ గురుకుల పార్ట్ టైం టీచర్స్ అసోషియసిన్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయులు హాజరయ్యారు ముఖ్యమంత్రి గురుకులంలో పని చేస్తున్న పార్ట్ టైం టీచర్స్ తక్కువ వేతనాలు తీసుకొంటున్నా కూడా లక్ష రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉందని వారిని ప్రశంసించారు. పార్ట్ టైం టీచర్స్ సిఎం గారికిధన్యవాదములు తెలుపుతూ తమకు గత మీ పాలన కాలంలోనే మేము రెట్టింపు జీతాలు తీసుకున్నామని, చాలా కాలంగా రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల వలే అన్నీ విధులను నిర్వహిస్తున్నామని , కాంట్రాక్టు టీచర్స్ మార్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 2000 మంది పార్ట్ టైం టీచర్స్ ను కాంట్రాక్టు బేసిస్ పరిదిలో నికి తీసుకు రావాల్సిందిగా కోరగా సిఎం సానుకూలంగా స్పందించారని, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కూడా ఈ కార్యక్రమాన్ని అభినందించారని, మీ సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోచిపాతల నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గురురత్నం, వర్మ,ఇస్మాయిల్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం నూతన ఉప కమిషనర్‌గా జి.వి.డి.ఎన్. లీలాకుమార్



**పెదకాకాని మేజర్ న్యూస్:** పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన నూతన ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధి కారిగా జి.వి.డి.ఎన్. లీలాకుమార్ మంగళవారము ఉదయం డి. శ్రీరామ వరప్రసాదరావు నుండి పరిపాలనా పరమైన బాధ్యతలు స్వీకరించినారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి నందు ఉపకమీషనరు మరియు ఉపకార్యనిర్వహణాధికారిగా పనిచేయుచున్న శ్రీ జి.వి.డి.ఎన్. లీలాకుమార్ సాధారణ బదిలీలలో భాగముగా శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారిగా నియమించబడినారు. నూతన ఉపకమీషనరుగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ జి.వి.డి.ఎన్. లీలాకుమార్ దేవస్థాన అర్చకస్వాములు, వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ప్రాంగణములో ప్రదక్షణలు చేసి శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకము, అమ్మవారి కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనము చేసి శ్రీ స్వామి వారి శేషవస్త్రము, తీర్థ ప్రసాదములు అందజేసినారు. భక్తులకు మెరుగైన సౌకర్యార్థములు కల్పించుటకు మరింత సౌకర్యవంతమైన వసతులు/ ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకొనగలనని ఆలయ ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ జి.వి.డి.ఎన్. లీలాకుమార్ తెలిపారు.

## డాక్టర్ సుదర్శన్ కు హెచ్ బీ తివారీ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు

### మరో 9 మందికి ఉత్తమ అధ్యాపకుల అవార్డులు

### ఏపీ ఎస్ఆర్ఎంలో ఘనంగా 'టీచర్స్ డే' వేడుకలు

**మంగళగిరి మేజర్ న్యూస్:** భారీ వర్షాలు, వరదల కారణంగా ఈ నెల 5న వాయిదా పడిన ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలను ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా బోధన, పరిశోధన, వర్సిటీ అభివృద్ధికి దోహదపడుతున్న పలువురు ప్రొఫెసర్లను యూనివర్సిటీ యాజమాన్యం అవుట్ స్టాండి%శీ%గ్ బెస్ట్ ఫ్యాకల్టీలుగా ఎంపిక చేసి సత్కరించారు. ఒక్కొక్కరికీ రూ.50 వేల నగదు పారితోషికం, జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. ఇన్చార్జి వీసీ డాక్టర్ సీవీ టామి, వర్సిటీ ముఖ్య సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్కుమార్, డీన్లు డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ విష్ణుపత్ లు వీరికి అవార్డులను ప్రదానం చేశారు. బయోలాజికల్ సైన్సెస్ విభాగానికి చెందిన డాక్టర్ సదర్శన్ గోవిందరాజన్




కు ప్రొఫెసర్ వివిస్ రావు ఫౌండేషన్ ద్వారా ప్రతిష్టాత్మక హెచ్బీ తివారీ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డును ప్రదానం చేశారు. ఆనంతరం మరో 9 మందికి యూనివర్సిటీ అవుట్ స్టాండింగ్ అవార్డులను ప్రదానం చేశారు. వీరిలో డాక్టర్ కార్తికేయన్. డాక్టర్ మాగంటి లక్ష్మీశిరీష, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ మహేశ్ కుమార్, డాక్టర్ రాజపాండియన్, డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి, డాక్టర్ అనుమలమూడి సతీష్, డాక్టర్ సునీల్ చిన్నదురై, డాక్టర్ విమల్ బాబులు ఉన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రొఫెసర్లకు జ్ఞాపికలను ప్రదానం చేసి గౌరవించింది. వీరిలో డాక్టర్ సత్యప్రమోద్, ప్రద్యుత్కుమార్ సంకీ, తపన్ కుమార్ హెూతా, డాక్టర్ ఉదయ్ శంకర్, డాక్టర్ మల్లిఖార్జున తదితరులున్నారు. ఈ ఏడాది యూనివర్సిటీ విద్యార్థులు మరో 10 మంది ప్రొఫెసర్లను ఉత్తమ ప్రొఫెసర్లుగా ఎంపిక చేసుకుని వారే స్వయంగా సత్కరించారు. యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, మహిళా విభాగం ప్రతినిధి నివేదాలు వీరికి జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీచర్స్ డే వేడుకలకు దృశ్యమాధ్యమ పద్దతిలో ముఖ్య అతిథిగా హాజరైన ముంబయి ఐఐటీ పూర్వ డైరెక్టర్ ఆచార్య దేవాంగ్ వీ కాకర్ యూనివర్సిటీ ప్రొఫెసర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు తన ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ శివరంగన్, అసోసియేట్ డైరెక్టర్ రేవతీ బాలక్రిష్ణన్, ఆకడమిక్స్ డీన్ డాక్టర్ వినాయక్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరి హాస్పిటల్‌లో ఎండోక్రైనాలజీ సేవలు ప్రారంభం






మంగళవారం గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్ లోని ఏలూరి హాస్పిటల్ లో ఎండోక్రినాలజీ విభాగం సేవలు ప్రారంభమయ్యాయి. సీఈవో పంతగాని యోహాన్ బాబు మాట్లాడుతూ ఎండోక్రైనాలజీ అనేది హార్మోన్లకు సంబంధించిన రుగ్మతల నిర్ధారణ మరియు నిర్వహణపై దృష్టి పెడుతుంది. ఈ విభాగం పూర్తి స్థాయి ఎండోక్రైన్ వ్యాధులు మరియు మధుమేహం, స్థూలకాయం మరియు తినే రుగ్మతలు, పారాథైరాయిడ్ రుగ్మతలు, బోలు ఎముకల వ్యాధి, పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్, గ్లైసెమిక్ రుగ్మతలు, పిట్యూటరీ & అడ్రినల్ డిస్‌ఫంక్షన్ మరియు థైరాయిడ్ వ్యాధుల వంటి హార్మోన్ సమస్యలకు పూర్తి స్థాయిలో చికిత్స చేస్తుంది ఆయన తెలియజేశారు. డాక్టర్ మానస,రామకృష్ణ మాట్లాడుతూ మా డిపార్ట్‌మెంట్‌లో అత్యంత అధునాతన లేబొరేటరీ సదుపాయంతో సపోర్ట్ చేసే కన్సల్టెంట్ ఎండోక్రినాలజిస్ట్, న్యూట్రిషనిస్ట్ మరియు ఫిజియోథెరపిస్ట్‌లతో కూడిన మంచి అర్హత కలిగిన బృందం ఉంది. అని తెలియజేశారు

**డాక్టర్ సందీప్ (ఎండోక్రినాలజిస్ట్) నేటి దిన పత్రిక సూర్యతో మాట్లాడుతూ**

మధుమేహం డయాబెటిస్ కేర్ ప్రోగ్రామ్ రెటినోపతి, నెఫ్రోపతీ, న్యూరోపతి మరియు ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ వంటి మధుమేహ సంబంధిత సమస్యల ప్రారంభ రోగ నిర్ధారణ, మూల్యాంకనం, ఇంటెన్సివ్ మేనేజ్‌మెంట్ మరియు నివారణను అందిస్తుంది. ఇది గర్భధారణ మధుమేహం నిర్వహణను కూడా అందిస్తుంది.

థైరాయిడ్ డిజార్డర్స్ హైపోథైరాయిడిజం, హైపర్ థైరాయిడిజం మరియు నాడ్యులర్ గోయిటర్స్ చికిత్స.

పిల్లలలో పొట్టి పొట్టితనము, ముందస్తు యుక్తవయస్సు, యుక్తవయస్సు ఆలస్యం, అస్పష్టమైన జననేంద్రియాలు (మగ మరియు ఆడ సూడో హెర్మాఫ్రొడిటిజం).

**అడ్రినల్ రుగ్మతలు**

పుట్టుకతో వచ్చే అడ్రినల్ హైపర్‌ప్లాసియా, కుషింగ్స్ సిండ్రోమ్, అడిసన్స్ వ్యాధి, అడ్రినల్ మాస్ మరియు ఎండోక్రైన్ హైపర్‌టెన్షన్.

**పిట్యూటరీ రుగ్మతలు..** పిట్యూటరీ అడెనోమాస్, కుషింగ్స్ వ్యాధి, అక్రోమెగలీ మరియు జిగాంటిజం, హైపోపిట్యూటరీ రాష్ట్రాలు, డయాబెటిస్ ఇన్సిపిడస్

**స్త్రీ ఎండోక్రైన్ రుగ్మతలు..** ప్రైమరీ అమెనోరియా మరియు టర్నర్స్ సిండ్రోమ్, గెలాక్టోరియా (మిల్క్ బ్రెస్ట్ డిశ్చార్జ్), పాలీ సిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (PCOS), క్రమరహిత ఋతుస్రావం, మొటిమలు, హిర్సుటిజం (అధిక జుట్టు పెరుగుదల)

**మగ ఎండోక్రైన్ రుగ్మతలు..** హైపోగోనాడిజం, క్లిన్‌ఫెల్టర్ సిండ్రోమ్., కాల్మాన్ సిండ్రోమ్.

**ఎముక మరియు ఖనిజ లోపాలు...** రికెట్స్, ఆస్టియోమలాసియా, హైపో మరియు హైపర్ పారాథైరాయిడిజం, బోలు ఎముకల వ్యాధి.

**ఊబకాయం మరియు లిపిడ్ రుగ్మతలు..** బాల్యం మరియు పెద్దల ఊబకాయం, హైపర్లిపిడెమిక్ స్టేట్స్, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సిండ్రోమ్స్ యొక్క హార్మోన్ల మూల్యాంకనం.

**వీటన్నిటిపై వైద్యం చేయొచ్చు అని ఆయన తెలిపారు**

## పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రారంభం



**పొన్నూరు మేజర్ న్యూస్** వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖలకు వారంలో రెండు రోజులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు వి రామకోటేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని కట్టెంపూడి, పచ్చల తాడిపర్రు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు వి .రామకోటేశ్వరి మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధ వారాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం క్షేత్రస్థాయిలో నిర్వహించబడుతుందని తెలిపారు. గుంటూరు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఐ సునీత, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాం సైంటిస్ట్ డాక్టర్ పి అమర జ్యోతి , స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు వి రామకోటేశ్వరి , స్థానిక మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య, తెలుగుదేశం పార్టీ మండలం ప్రెసిడెంట్ బండ్లమూడి బాబురావు కట్టెంపూడి గ్రామ ఎక్స్ సర్పంచ్ శ్రీ యక్కటి పద్మారావు గారు రెండు గ్రామాల రైతులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రాఫ్ సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల అవగాహన సదస్సు



**గుంటూరు మేజర్ న్యూస్:** గుంటూరు, 21వ డివిజన్ పరిధిలోని కొండావెంకటప్పయ్య కాలనీలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్- క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నియంత్రించాలి ! వార్డు బాల్య వివాహాల నిరోధక కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి అనే అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు, చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ (సిడిపిఒ) తోట. కృష్ణవేణి మాట్లాడుతూ బాల్య వివాహం వద్దు బాలిక భవిష్యతే ముద్దు. వివాహం చేయాలంటే అమ్మాయికి 18 సంవత్సరాలు నిండాలని, అలాగే అబ్బాయికి 21 సంవత్సరాలు నిండాలని, బాల్య వివాహాలు జరిగిన దంపతులకు పుట్టే పిల్లలు శారీరక, మానసిక లోపంతో ఉండే అవకాశాలు ఎక్కువ అని తెలియపరిచారు. ఈ సమావేశంలో 21వ డివిజన్ కార్పొరేటర్ కె.గురవయ్య మాట్లాడుతూ బడి బయట ఉన్న బాలలు బడిలో ఉండే విధంగా చూడాలని, మన వార్డ్ లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, బాలలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు, అడిషనల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సిహెచ్. చంద్రకళ (ఏ. సిడిపిఒ) మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాలు లోపు మగ పిల్లలకు వివాహం చేయుట చట్టరీత్యా నేరమని, ఇందుకుగాను రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి.వెంకట్, కొల్లి శారద రౌండ్ టేబుల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి. రాంబాబు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు థామస్ రెడ్డి, అంగన్వాడి వర్కర్స్ సులోచన, విలాసిని, స్కూల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ అండ్ మెంబెర్స్, డ్వాక్రా మహిళలు, క్రాఫ్ స్టాఫ్ జయరాజు, బ్యూలా, వార్డు పెద్దలు, మరియు బాల పంచయతి బాలలు పాల్గొన్నారు.

## ఆ గురుకులంలో ఉండలేం.. విద్యార్థుల గగ్గోలు

(మొదటిపేజీ తరువాయి)

పెడుతుండటంతో రాయలేకపోతున్నామని తెలిపారు. దీంతో డీఎస్పీ నాగేశ్వరరావు వార్డెన్, ఉపాధ్యాయులను పిలిచి మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తల్లిదండ్రులు కంగారు పడతారని, ఈ విధంగా ఎప్పుడూ చేయొద్దని విద్యార్థులకు సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, అప్పుడప్పుడూ తాను వస్తానని పోలీసులు తెలిపారు. అమ్మానాన్న వచ్చినప్పుడు ఏదైనా సమస్య చెబితే, ఎందుకు మీరు చెప్పారు అని ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు బయటకు వెళ్తే గోడ దూకి వెళు తున్నారని, అప్పుడు అలా వెళ్లొద్దని ఉపాధ్యాయులు తిడుతున్నారని అన్నారు. అదే విధంగా కొంతమంది టీచర్లు తినకూడని పదార్థాలు తింటున్నారని విద్యార్థులు చెప్పారు. చివరికి క్రాప్ చేయించుకుంటే కటింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు.

**స్కూల్ ప్రిన్సిపాల్ తరుచూ వేధిస్తున్నాడు..** విద్యార్థులు పారిపోవడాన్ని గమనించిన సిబ్బంది వెంటనే 27 మందిని పట్టుకున్నారు. మరో 40 మంది పాఠశాల ప్రహరీ గోడ దూకి సమీపంలోని కొండవీడు కొండలపైకి వెళ్లారు. విద్యార్థులు ఎటు వెళ్లారనే విషయంపై ఉపాధ్యాయులు చుట్టుపక్కల ఆరా తీయగా విషయం తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయుల సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్సై బాలకృష్ణ పోలీసులతో కలిసి కొండల వద్దకు వెళ్లి విద్యార్థులను తీసుకుని వచ్చారు. ఘటన స్థలికి నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు హాస్టల్ వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను విచారించారు. అసలు కొండపైకి ఎందుకెళ్లారంటూ పోలీసులు ప్రశ్నించారు. దీంతో విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతరావు తరుచూ వేధిస్తున్నాడని చిన్న చిన్న విషయాలకే తమను కొడుతున్నాడని విద్యార్థులు చిలకలూరిపేట రూరల్ సిఐ సుబ్బా నాయుడుకి చెప్పారు. ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేకే ఇక్కడికి పారిపోయి వచ్చామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్య తెలుసుకున్న పోలీసులు వెంటనే వారందరిని బుజ్జగించి కొండ దించారు.

## మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఎంటీఏంసీ పరిధిలో పలు బోర్లకు మరమ్మతులు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** తాడేపల్లి పట్టణం 10వ వార్డు పరిధిలోని వడ్డెర బజార్, 7వ వార్డు పరిధిలోని బొగ్గిళ్లు ప్రాంతం, మంగళగిరి బాప్టిస్ట్‌పేట కబేళారోడ్ ప్రాంతంలో పాడైపోయిన బోర్లకు మున్సిపల్ సిబ్బంది మంగళ వారం మరమ్మతులు చేయించారు. ఈ వార్డుల పరిధిలోని చేతిపంపుల దుస్థితిని స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన మంత్రి నారా లోకేష్ వెంటనే బోర్లకు మరమ్మతులు చేయాలని ఎంటీఏంసీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో సిబ్బంది దగ్గరుండి మరి చేతిపంపులకు మరమ్మతులు చేయించారు. దీనితో ఆయా ప్రాంతాల ప్రజలు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## 26న సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు కు అక్కినేని పురస్కార ప్రధానం

**గుంటూరు( సాంస్కృతికం) మేజర్ న్యూస్ :** స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కళా విపంచి ఆరాధన ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 26న ప్రముఖ సినీ హాస్య దర్శకుడు రేలంగి నరసింహారావుకు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారంతో సత్కరించనున్నట్లు బొప్పన నరసింహారావు, బి మల్లికార్జున రావు తెలిపారు. సభానంతరం ఆరాధన ఆర్ట్ అకాడమీ వారిచే మరీ అంతొద్దు నాటిక, మువ్వ పెద్ద బాపిరెడ్డిచే పౌరాణిక నాటకాలలోని పద్యాల ఆలాపన ఉంటాయన్నారు.

## నారా లోకేష్ సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ



**మంగళగిరి, మేజర్ న్యూస్:** వరదల వల్ల మంగళగిరి పట్టణం లోని కొండచరియలు విరిగిపడి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని గండాలయపేట, కొత్తపేట, ద్వారకానగర్‌లో ఉపాధి కోల్పోయిన 47 కుటుంబాలకు గత 15 రోజుల పాటు పునరావాసం కల్పించి మంగళవారం నాడు 5వ సచివాలయం వద్ద నిత్యావసర సరుకులు అందజేశారు. ఒక్కోక్క కుటుంబానికి 30 కేజీల బియ్యం, 5 రకాల నిత్యావసర సరుకులను సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ నాయకులు అందజేశారు. పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు మట్లాడుతూ నియోజవర్గ వరద బాధితులకు మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారన్నారు. వరద బాధితులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారికి అవసరమైన నిత్యావసర సరుకులు, అల్పాహారం, భోజనం, పాలు, కూరగాయలు అందజేసినట్లు చెప్పారు. మంగళగిరి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు, గుంటూరు పార్లమెంటరీ సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ, మరియు వార్డు సచివాలయం సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘనసన్మానం



**దాచేపల్లి మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చే విధంగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిగా పేరుగాంచిన మండలం లోని నడికుడి నగర పంచాయతీకి చెందిన బొల్లంపల్లి యేసు రత్నం కు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా , ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించడం జరిగింది . మంగళవారం పిడుగురాళ్ల పట్టణంలో కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్నాథ్ , ఒంగోలు జిల్లా జడ్జి కూచిపూడి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా , ఆయనకు శాలువాలు కప్పి , పూలదండలతో ఘనంగా సత్కరించి , అభినందనలు తెలుపుతూ ,గుర్రం జాషువా సాహితి పురస్కార్ జ్ఞాపికను బహుకరించడమైనది . ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రూత్ బెన్ని , లాయర్లు స్వర్ణలత , విజయ కుమారి , చెట్టిపోగు యేసురత్నం , కార్డ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు .

## విశ్రాంత డిఎస్పి ఇంట్లో చోరీ

**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** విశ్రాంత డిఎస్పి పెంచల నాయుడు ఇంట్లో చోరీ సంఘటనపై మంగళవారం పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు చంద్రమౌళి నగర్ 6/1 లైన్ లీలా హోమ్స్ అపార్ట్మెంట్లో డిఎస్పి కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులతో నెల్లూరు వెళ్లారు. విషయం గుర్తించిన ఇద్దరు దొంగలు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లారు. బీరువా తాళాలు పగలగొట్టి విలువైన వజ్రాల నెక్లెస్, బంగారం, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. సోమవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు గుర్తించారు. తొలుత కృష్ణా రెసిడెన్సి అపార్ట్మెంట్లోకి వెళ్లాలని అగంతకులు ప్రయత్నం చేశారు. వాచ్ మెన్ మెలకువగా ఉండటంతో అక్కడనుండి ఎదురుగా ఉన్న అపార్ట్మెంట్ కు వచ్చారు. అగంతుకులు ఇద్దరూ కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే వెస్ట్ డిఎస్పి జయరాం ప్రసాద్, ఎస్సై రాంబాబు సంఘటన స్థలానికి వెళ్లి చోరీ తీరును పరిశీలించారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ. 18 లక్షలు ఉంటుందని ఎస్ఐ రాంబాబు తెలిపారు.

## జనసేన ఆధ్వర్యంలో శ్రీవారికి శాంతి పూజలు



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానముల లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వుతో తయారైన నెయ్యి వాడడం పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంతో నిరసన కార్యక్రమలు చేపట్టడం తెలిసిన సంగతే.. ఈ నేపద్యంలో జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీక్షను చేపట్టారు.. అందుకు మద్దతుగా తమ అధినాయకుడి బాటను అనుసరిస్తూ.. పట్టణంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సెక్రటరీ వీరవల్లి వంశీ ఆధ్వర్యంలో స్థానిక సత్తెనపల్లి రోడ్డులో అయ్యప్ప స్వామి దేవస్థానం పక్కన ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో మంగళవారం శ్రీవారి కి శాంతితో కుడిన ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జనసేన పార్టీ ఇన్చార్జి జిలానీ, కపలవాయి విజయకుమార్, సింగరాజు సాయి కృష్ణ, జి.వి.ఎస్ ప్రసాద్, నరసరావుపేట ఛాంబర్ కామర్స్ ప్రెసిడెంట్ వనమా శివ, గట్టు హనుమంతరావు, రాష్ట్ర బులియన్ మర్చంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిర్లిక శ్రీనివాసరావు, జనసేన ప్రోగ్రాం జిల్లా కమిటీ హనీ సైదా, నరసరావు పేట మండల ప్రధాన కార్యదర్శి ఓలేటి విజయ్, జిల్లా కార్యదర్శి దుర్గ కుమారి, పట్టణ ఉపాధ్యక్షులు మెడిసెట్టి రాము, రామిశెట్టి రామకృష్ణ, పట్టణ యూత్ ప్రెసిడెంట్ మీనా దినేష్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సాతా సాయి చంద్, పట్టణ మహిళా అధ్యక్షులు దాసరి శివలీల, దాసరి యలమంద, సూర్య, ఎ వి ఆర్, పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ళ శ్రీను, ఎద్దల శ్రీను, రాకేష్, జెల్లి అయ్యప్ప, శ్రీ రాం కామన్ మాన్, అచ్చుత్ పొట్టి, కొవ్వూరి నరసింహారావు, మండల వైస్ ప్రెసిడెంట్ అప్పిసెట్టి లక్ష్మి నారాయణ, ఒక వార్డు ఇంచార్జ్ తేజ వల్లారపు, బాజీ వింగిదేల ఇస్మాలెం, ఆలయ ధర్మకర్తలు కాకుమాను రాంబాబు బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు. అర్చకులు పీవీపీఎ వరప్రసాదు ఆచార్య పాల్గొని స్వామి వారి శాంతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

## వేల్పూరులో "ఇది మంచి ప్రభుత్వం"



**శావల్యాపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని వేల్పూరు గ్రామంలో మంగళవారం ఉదయం నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమానికి వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు ,జడ్పీటీసీ పారా హైమావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి 100 రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వారు ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన సభలో నేతలు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ సంక్షేమానందిస్తు "ఇది మంచి ప్రభుత్వం" అని ప్రజల చేత పిలిపించుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టిడిపి, జనసేన నాయుకులు జనసేన పార్టీ సమన్వయకర్త నాగ శ్రీను రాయల్, జనసేన నాయకులు నిశంకర్ శ్రీనివాసరావు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం లో మంగళవారం 11వ డివిజన్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అధికారులతో కలిసి పాల్గొని ఇంటింటికి వెళ్లి వందరోజుల పాలన ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేస్తూ వార్డు సభలో ప్రజల సమస్యలపై వారి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చేసిన పాపాల కారణంగా రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు కుప్ప కూలిపోయి రాష్ట్రం సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమం,అభివృద్ధి దిశేగా పరుగులు తీయిస్తున్నారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతిదీ నిలబెట్టు కుంటూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు అలాగే మెగా డీఎస్సీ ని ప్రవేశపెట్టారన్నారు. అలాగే పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు పునః ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే చంద్రబాబు గారు తొలి సంతకం పెట్టారని తెలిపారు. ఇటీవలే రాష్ట్రంలో వరద విపత్తుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను పార్టీ నాయకులను, కార్యకర్తలను అప్రమత్తం చేసి వరద ప్రాంతాలలో సహాయక చర్యలు చేయిపట్టారని వరద బాధిత ప్రాంతాల ప్రజల కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమించిందన్నారు. వరద బాధితులను ఆదుకునే విధంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి ఒక్కరు ముందుకొచ్చి సీఎం సహాయ నిధికి భారీ విరాళాలు అందించడం అభినందనీయమని. సంక్షోభంలోనూ సంక్షేమం సృష్టిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేసే సంక్షేమాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజలు మెచ్చుకునే సుపరిపాలన దించనున్నట్లు ఎమ్మెల్యే నసీర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు దేగల ప్రభాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు, ఉస్మాన్, మజహార్,జమీర్, తదితర అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# దేవుడి శిక్షకు రెడీగా ఉండు జగన్ : ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** కమీషన్ల కక్కుర్తితో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి సన్నిధి లో కల్తీ పనులు చేశావు,దైవం జోలికి వెళ్ళావు, ప్రజా కోర్టులో శిక్ష పడింది,ఇక దేవుడి శిక్షకు రెడీగా ఉండు జగన్ అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ వ్యవధి పరిపాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించడానికి ధూళిపాళ్ళ గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. గడపగడపకు తిరిగి 100 రోజుల పాలన గురించి ప్రజలను అడిగి తెలుసు కున్నారు. ప్రతి ఇంటికి మేలు చేకూర్చడమే ప్రభుత్వం లక్ష్యమని, ప్రతినెల ఒకటో తేదీన పెన్షన్లు, జీతాలు





ఇచ్చిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదని అన్నారు. "ఇది మంచి ప్రభుత్వం" అని ప్రజలు మా కూటమి ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజే ముఖ్యమంత్రి మేమంతా పాలకులం కాదు, ప్రజా సేవకులం అని ప్రకటించారు. వందరోజుల పాలనలో అభివృద్ధి-సంక్షేమం చూసి మాది మంచి ప్రభుత్వమని ప్రజలే అంటున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలో సీసీ డ్రైన్స్ కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బొర్రా అప్పారావు, దరువూరి నాగేశ్వరరావు, జనసేనా కౌన్సిలర్ సుమన్,తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## గారపాడు, హుస్సేనగరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** పెదకూరపాడు మండలంలోని గారపాడు, హుస్సేన్ నగరం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారిని ఐశాంతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిలో గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించటానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కొక్క లింగాకర్షక బుట్టలో 8 రెక్కల పురుగులు వరుసగా 3 రోజులు గమనించినట్లయితే ప్రొఫెనోఫాస్ 400ఎంఎల్ ఎకరానికి లేదా క్లోరిఫెరిఫాస్ 500ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయవలెనని మండల వ్యవసాయాధికారి ఐ.శాంతి తెలియచేశారు. డాక్టర్ రాధికా రమ్య, లాంఫామ్ శాస్త్రవేత్త మిరపలో సస్య రక్షణ చర్యల గురించి తెలియజేశారు.డాక్టర్ బి. శ్రీదేవి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పశుసంవర్ధక శాఖలో ఉన్నటువంటి వివిధ పథకాల గురించి తెలియజేశారు. యు. శ్రీ నిత్య, ఉద్యానాధికారి ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలను రైతులు వినియోగించు కోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు శ్రీమతి ఎల్. యశస్విని, బి.రాజు, గ్రామ పెద్దలు మరియు ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** విజయవాడ వరద బాధితులకు నిత్యవసర వస్తువులు, దుస్తులను రెండు వాహనాలో వైసీపీ మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం బయలుదేరారు. ఈ సందర్బంగా నిత్యవసర వస్తువుల వాహనాలకు పచ్చ జెండా ఊపి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సంభవించిన వరదలలో విజయవాడ నగరం అతలాకుతలమైన సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఆహారం లేక ఉండటానికి తావులేక అనేకమంది ఇబ్బందులు పడ్డారు. ఈ విపత్తును దృష్టిలో పెట్టుకొని సెప్టెంబర్ 12వ తేదీన నా జన్మదినోత్సవం సందర్భంగా వేడుకలు రద్దు చేస్తూ వరద బాధితులకు సహాయం చేద్దాం అని వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు ఇచ్చిన పిలుపు నేపథ్యంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు




పెద్ద ఎత్తున స్పందించి సుమారు పది లక్షల రూపాయలు కు సరిపడా నిత్యవసర వస్తువులు 50 క్వింటాళ్ల బియ్యం, వంటనూనెలు, కందిపప్పు పసుపు, కారం, దుప్పట్లు, చీరలు వంటి ఏడు రకాల వస్తువులను రెండు వాహనాల్లో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలతో విజయవాడకు బయలుదేరాడు. ఈ సందర్భంగా సహాయం చేసిన ప్రతి ఒక్క వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. విజయవాడలోని వన్ టౌన్ పరిధిలో మాజీ మంత్రి వేల్లంపల్లి శ్రీనివాస్ టూ టౌన్ పరిధిలో మల్లాది విష్ణు సహకారంతో ఎవరికైతే సహాయం అందలేదో,వారికి స్వయంగా మా చేతుల మీద అందజేయడం జరుగుతుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వరద బాధితులు చేసిన సమయంలో ఉడతా భక్తి సహాయంగా భావిస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామని, మరొక్కసారి ఈ కార్యక్రమానికి సహాయం చేసిన ప్రతి ఒక్క దాతలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆటల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**కారంపూడి, మేజర్ న్యూస్ :** కారంపూడి మండలంలోని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా కారంపూడిలో భారీగా ఏర్పాటు చేసిన బేకరీను ప్రారంభించారు. అనంతరం స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు పిన్నెల్లి శ్రీవిద్య అందించిన టీషర్టులను క్రీడాకారులకు బహుకరించారు. ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ విద్యా బోధన చేయగల టీచర్లు ఉన్నారని విశాలమైన ఆట స్థలం తో పాటు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. చదువుల్లో ప్రస్తుతం బాలికలదే అగ్రస్థానం అని, బాలికలతో పాటు పోటీపడి బాలురు సైతం చదవాలని సూచించారు. కొంతమంది చెడు వ్యసనాలకు అలవాటు పడి విద్యను దూరం చేసుకుంటున్నారని, భవిష్యత్తులో విద్య ఎంతో ఉపయోగపడుతుందని గుర్తించి బాలికలతో పోటీపడి బాలురు సైతం విద్యను అభ్యసించాలని కోరారు. కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామ శివారులోనీ చిరుమామిళ్ల సుబ్బయ్య పొలంలో పొలం పిలుస్తుంది రా కార్యక్రమంలో కంది చేలో ఎద్దులతో దుక్కి దున్ని రైతులని ప్రోత్సహించారు అనంతరం పొలం పిలుస్తుంది రా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ "పొలం పిలుస్తోంది.. రా" కార్యక్రమం రైతులకు పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచేందుకు తోడ్పడుతుంది. ఆధునిక సేద్యంపై ఏ విధంగా అడుగులు వేయాలో రైతులకు అర్థమయ్యేలా వివరించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రతి రైతు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉన్నం. లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి.అంజయ్య, పంగులూరి. పుల్లయ్య, చప్పిడి రాము, గోళ్ళ సురేష్ యాదవ్, బొల్లినేడి శీను, జనసేన సమన్వయకర్త బుసా రామాంజనేయులు, కేసనపల్లి. కృష్ణ బాబు, మునుగోడు సత్యం, నీళ్ల అంజయ్య, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, కొండపల్లి. అప్పారావు, చిరుమామిళ్ళ శ్రీను, బొల్లినేని హరికృష్ణ, పంగులూరి. లక్ష్మయ్య, కిలారి పవన్, వట్టికొండ పెద్దబ్బాయి, చిరుమామిళ్ల రామ లక్ష్మయ్య, బోలినేడి మల్లికార్జున రావు, ఎంపీడీఓ గంట శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మండల అధికారి యలమందారెడ్డి, ఏపీఓ కోటిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, కూటమీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరం




**నూజెండ్ల, మేజర్ న్యూస్ :** మండలంలోని ముక్కెళ్లపాడు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సింగంశెట్టి వెంకట బాల ప్రసాద్ ప్రారంభించగా ముఖ్య అతిథులుగా స్థానిక పశువైద్య అధికారి డాక్టర్ దేవినేని వెంకటశివాజీ పాల్గొని పాడి రైతులకు పశు గ్రాసాల పెంపకం,దూడల పెంపకం,లింగ నిర్ధారణ వీర్యం ఎద లక్షణాలు గురించి రైతులకు వివరించారు. 40 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. అలాగే పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంద్రా రామకృష్ణ, ఎస్ఎంసి మాజీ చైర్మన్ మాలపాటి రామాంజనేయులు, పశువైద్య సిబ్బంది, జనసేన నాయకులు సింగంశెట్టి శ్రీనివాసరావు, బత్తుల రామయ్య,మాలపాటి శ్రీనివాసరావు, తుంగా బ్రహ్మయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

## వరద బాధితుల సహాయార్థం శ్రీ కాకతీయ విద్యాసంస్థలు ఆరు లక్షల విరాళం





**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెద్దకూరపాడు శ్రీ కాకతీయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు మరియు వారు సేకరించిన విరాళాలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు మరియు యాజమాన్యం ఇచ్చిన మొత్తం 5 లక్షల రూపాయల చెక్ ను, మరియు నిరుపేదలకు ఐదు రూపాయలకే అన్నం పెట్టి ఆకలి తీర్చే "అన్నా క్యాంటీన్" కి తమ సంస్థ నుండి మరో లక్ష రూపాయలు చెక్ తో కలిపి మొత్తంగా ఆరు లక్షల రూపాయల చెక్కులను మంగళవారం రాష్ట్ర సచివాలయం అమరావతి ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ని కలిసి విద్యార్థుల చేతులమీదుగా శ్రీ కాకతీయ విద్యా సంస్థల యాజమాన్యం అందించడమైనది. ఈ సందర్భంగానే మానవ వనరుల శాఖ మాత్యులు నారా లోకేష్ ని కూడా కలవడమైనది. వారు విద్యార్థులకు వారి ఆశిస్సులను అందచేశారు. ఈ సందర్భంగా శ్రీ కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ శీలంనేని సాంబశివరావు, సెక్రటరీ %డ% కరస్పాండెంట్ దీవి లలిత బాబు లు మాట్లాడుతూ మన గౌరవ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఇచ్చిన స్ఫూర్తితో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఇతోధికంగా సాయం చేయాలనే వారి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలియచేశారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రతిఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియచేశారు. గతంలో హుద్ హుద్ తుఫాన్ సందర్భంగా కూడా తమ సంస్థ నుండి రెండున్నర లక్షల రూపాయలు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి అప్పుడు అందచేసిన విషయాన్ని గుర్తుచేశారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అభివృద్ధిలో పెదకూరపాడు నియోజకవర్గాన్ని రాష్ట్రం లోనే మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేస్తామన్నారు. ఐదవ రోజు "ఇది మంచి ప్రభుత్వం" పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా బెల్లం కొండ మండలం పాపాయ పాలెంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజా వేదికలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వంద రోజులుగా చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా పెదకూరపాడు నియోజకవర్గానికి అధిక మొత్తంలో నిధులను తెచ్చి అభివృద్ధి చేసేలా కృషి చేస్తామని హామి ఇచ్చారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించడంతో పాటు భవిష్యత్తులో అమలు చేయనున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడం" ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ రూ.4 వేలకు పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, గ్రామీణాభివృద్ధికి పంచాయతీలకు నిధులు కేటాయింపు, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు ఐదు రూపాయలకే భోజనం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు లాంటి హామీలను చంద్రబాబు అమలు చేశారని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం అట్టడుగు స్థాయికి చేరిందని అపార అనుభవం కలిగిన చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నా రన్నారు. వందరోజుల్లోనే నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి రెండు కోట్ల రూపాయల చొప్పున ఐదు మండలాలకు పది కోట్ల రూపాయల నిధులను కేటాయించామని తెలిపారు. సూపర్ సిక్స్ అమలులో భాగంగా దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని చంద్రబాబు అమలు చేస్తున్నారని చెప్పారు. రానున్న ఐదు సంవత్సరాలకు నియోజకవర్గ అభివృద్ధి పై ప్రణాళికను సిద్ధం చేసి దానిని అమలు చేస్తామన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు, పోలీసులు పని చేయాలని సూచించారు. ప్రతి మండలంలో వారానికి ఒక రోజు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## చాటగడ్డపాడులో స్వచ్ఛతాహి సేవ




**వినుకొండ, మేజర్ న్యూస్ :** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చాట్రా గడ్డ పాడు సింగల్ యూస్ ప్లాస్టిక్ అవగాహన గడపగడపకు షాప్ షాప్ కెళ్ళి ప్లాస్టిక్ వాడకంపై తెలియజేయడం జరిగింది . కార్యక్రమంలో ఈఓపిఆర్డి సుందర్ రెడ్డి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వలన నీటి కాలుష్యం సముద్రాలకు జంతువులకు మానవులకు వినాశనకరమైన ప్రభావాన్ని చూపుతుందని అందువలన ప్లాస్టిక్ గ్లాసులు పాలతిన్ కవర్లు స్ట్రాసు ప్లాస్టిక్ గ్లాసులు వాటర్ బాటిల్స్ ఫుడ్ ప్యాకేజింగ్ వాటికి ఎక్కువ ధరలు చెప్పినట్లయితే వాడడం మానేస్తారని పర్యావరణ పర్యావరణానికి అనుకూలమైన ఉత్పత్తులను, సేవల వైపు వెళ్లాలని సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడడం మానేయడం వాటి బదులు గోన సంచులు క్లాత్ సంచులు వాడాలని తెలియజేసినారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ రావు పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వ్యక్తిని తల్లికి అప్పగించిన పోలీసులు..



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఏడు సంవత్సరాల క్రితం తప్పిపోయిన వ్యక్తిని నరసరావుపేట 1 టౌన్ పోలీసులు విజయవంతంగా కనుగొన్నారు. ఈ సందర్భంగా తప్పిపోయిన జోసెఫ్ దేవదానంని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. 2017లో దేవదానం అదృశ్యమైయ్యాడని నరసరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల నిరంతర ప్రయత్నాలు, సమగ్ర విచారణ అంకితభావంతో పనిచేసి చివరికి దేవదానం ఆచూకీ కనుగొని, అతని తల్లికి సురక్షితంగా అప్పజెప్పారు. తమ బిడ్డ క్షేమంగా తిరిగి వచ్చేలా చేయడంలో పోలీసుల నిర్విరామ కృషికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత సున్నితమైన కేసులను సైతం పరిష్కరించి కుటుంబాలకు ఊరట కలిగించడంలో నరసరావుపేట1 టౌన్ సీఐ చరణ్ సిబ్బంది అంకితభావం పోలీసుల నిబద్ధతకు ఈ ఉదంతం నిదర్శనం. అదృశ్యం చుట్టూ ఉన్న పరిస్థితులను తదుపరి దర్యాప్తులో తెలుసుకుంటామని పేర్కొన్నారు.

## ఉచిత ఇసుక ఊసే లేదు

**ఇసుక లేక పడిగాపులు కాస్తున్న భవన నిర్మాణ కార్మికులు**

**-ఆన్ లైన్ లో పల్నాడు జిల్లాను చూపటం లేదు**

**4 టన్నుల ట్రక్ ఇసుక రూ.6 వేలకు పై మాటే**

**పల్నాడు భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్**



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లాలో ఇళ్ళ నిర్మాణం యజమానులకు ఇసుక సరఫరా లేక, భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అడ్డాల వద్ద పడికాపులు కాయాల్సి వస్తుందని పల్నాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు అవార్ ప్రసాద్ రావు అన్నారు.ఈ మేరకు మంగళవారం స్థానిక పుతుంబాక భవన్లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఆన్లైన్ బుకింగ్ చూపించకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ఇళ్ళ యజమానులకు అందడం లేదని అన్నారు. ఆన్లైన్ బుకింగ్ ఉన్నా ఇచ్చిన సమయం అరగంటలో ఆన్లైన్ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు మాత్రమే చేసుకోగలుగుతున్నారని, ఆన్లైన్ పరిజ్ఞానం లేని సామాన్యులైన వారికి ఇసుక తెచ్చుకోలేకపోతున్నారని అన్నారు. ఆన్లైన్ చేసుకుందామని నెట్ సెంటర్ కు వెళితే ఆ కంప్యూటర్ సిస్టంలో పల్నాడు జిల్లా చూపటం లేదని నెల్లూరు, కర్నూలు జిల్లాలు మాత్రమే చూపిస్తున్నదని ఆ జిల్లాల నుండి బుకింగ్ చేయమంటే చేస్తామని నెట్ సెంటర్ వారు అంటున్నారు. ఆ జిల్లాల నుండి బుకింగ్ చేసుకొని ఇసుకను ఈ పల్నాడు జిల్లాకు తెచ్చుకోవాలంటే (4 టన్నుల) ట్రక్ ఇసుక 10వేల నుండి 12 వేల రూపాయలు అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ఊసే లేదని అన్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని ఇసుక డంపింగ్ యార్డులను పుష్కలంగా ఇసుకతో నింపి పల్నాడు జిల్లాను కూడా ఆన్లైన్లో పొందుపరిచి ఆన్లైన్ బుకింగ్ ను సరళతరం చేసి ఇసుకను సరఫరా చేయాలని తద్వారా భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పల్నాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పట్టణ అధ్యక్షులు మొగల్ ఆదాంషా, కార్యదర్శి గొట్టిపాటి సాల్మన్ రాజులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు తమ పరిధిలోని ప్రాంతాల్లో ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ సగర కాలనీ, రామిరెడ్డి తోట, ఓల్డ్ క్లబ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలను సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకొని సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తొలుత సగర కాలనీలోని పలు వీధులను పరిశీలించి, స్థానికులను సమస్యల గూర్చి అడిగి తెలుసుకొని, వర్షాలకు నీరు నిల్వకుండా ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్దం చేయాలన్నారు. సదరు ప్రాంతంలో మెయిన్ రోడ్ కి చాలా లోతట్టుగా ఉన్నందున లెవల్స్ సేకరించాలన్నారు. అనంతరం రామిరెడ్డి తోట మొదటి లైన్ ని పరిశీలించి, వర్షం వలన డ్రైన్ లోకి వెళ్లాల్సిన నీరు వెళ్లకుండా రోడ్ల మీదకు రావడం, బురద ఉండడం గమనించి సంబందిత ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల మీద ఉన్న బురదను దగ్గర ఉండి కార్మికులతో శుభ్రం చేయించారు. ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రామిరెడ్డి తోట 1వ లైన్ లో నీరు నిల్వ ఉండకుండా, శాశ్వత పరిష్కార మార్గాలతో ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, డ్రైన్ల మీద ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. అలాగే ఓల్డ్ క్లబ్ రోడ్ లో డ్రైన్ల మీద ఉన్న ఆక్రమణలను తొలగించామని, రోడ్ మీద పడిన వర్షం నీరు నేరుగా డ్రైన్ లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణల తొలగింపు వ్యర్థాలను వెంటనే తరలించి జిఎంసి లో లెవల్ స్థలాల మెరక చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ ఎం.శ్రీవల్లి, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఏడిహెచ్ రామారావు, ఏసిపి అజయ్ కుమార్, ఎంహెచ్ఓలు రామారావు, ఆనంద కుమార్, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, డిఈఈ రాము, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వినుకొండలో పౌష్టికాహార మాసోత్సవాలు



**వినుకొండ మేజర్ న్యూస్:** పౌష్టికాహార- మాసోత్సవాలు వినుకొండ-ఎ సెక్టారు పరిధిలోని అంగనవాడి కేంద్రం, పోలేరమ్మ గుడి బజార్ నందు సిడిపిఓ ఎం అనురాధ ఆధ్వర్యంలో పౌష్టికాహార మహొత్సవాల ఘనంగా నిర్వహించారు. సభ అనంతరం పట్టణములో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వినుకొండ మండలం ఎంపీడీవో కే. సుందర్ రెడ్డి, సూపర్వైజర్ జి. శేష కుమారి, మాట్లాడుతూ నేటి సమాజంలో గర్భిణీ మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలు భాగంగా ఆకుకూరలు చిరుధాన్యాలు, మునగాకు, ముఖ్యంగా అంగనవాడి వారు అందజేసే పౌష్టిక ఆహారాలను తల్లి బిడ్డ కంపల్సరిగా వాడాలని అన్నారు కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎస్. మరియమ్మ, ఎస్ కె .అబిదా బేగం, సిహెచ్. సూచరిత, సిహెచ్. షహనాజ్ బేగం, పి. ఫిర్యాదు, మరియు గర్భిణీలు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## ప్రముఖ కవి కే.జే. రమేష్‌కు “గుర్రం జాషువా అవార్డు”



**వినుకొండ, మేజర్ న్యూస్ :** పట్టణానికి చెందిన రచయిత ప్రముఖ కవి కే.జే. రమేష్ కు గుంటూరు పట్టణానికి దళిత రచయితల సంఘం వారు గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా “గుర్రం జాషువా అవార్డు” బహూకరిస్తున్నట్లు ప్రకటించారు ఈ నెల 26న గుంటూరు నందు జరిగే అవార్డుల ప్రధానోత్సవం సభలో ఈ అవార్డును బహూకరిస్తున్నట్లు కవి కే.జే. రమేష్ తెలిపారు. పదికి పైగా గ్రంథములు రచించి ప్రచురించిన కే.జే. రమేష్ కు జాషువా రచనల నుండి గ్రహించిన పద్యాల నుండి మేలిమి పద్యాలను వ్రాసిన వ్యాక్యానంతో కూడిన “వినుకొండ నుండి విశ్వనారుడు” కు మంచి పేరు వచ్చింది “బైబిల్ నానిలు” “దేవునితో మహా ప్రయాణం” వంటి బైబిల్ సంబంధిత రచనలు రాసిన కే.జీ. రమేష్ త్వరలో “సెయింట్ థామస్ జీవితం- సేవా ప్రయాణం” గ్రంథం వెలువడనున్నట్లు తెలిపారు. వీరికి అవార్డు రావడం పట్ల పలు సాహితీ సంస్థలు కవులు కళాకారులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## పొలంబడితో సమగ్ర యాజమాన్య సస్యరక్షణ



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** ముప్పాళ్ల మండల పరిధిలోని చాగంటివారిపాలెం, లంకెల కూరపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంతో ప్రతి మంగళ బుధవారాల్లో క్షేత్రస్థాయిలో పంటల పరిశీలించి రైతులు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ వారి వ్యవసాయ పథకాలు, పంటల సరళి, పంట మార్పిడి, పోషక లోపాల నిర్వహణ, సేంద్రియ వ్యవసాయం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పశు సంవర్ధక శాఖ, గ్రామ అధికారి, మొహమ్మద్ కిసాన్ క్రెడిట్ కార్డు, పశువుల టీకా లు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విఏఏ శైలజ, సుభాని రైతులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో విలియమ్స్‌కు సన్మానం



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** బదిలీపై ముప్పాళ్ల వచ్చిన ఎంపీడీఓ విలియమ్స్ ను పల్నాడు జిల్లా ఎంఎస్పి అధ్యక్షుడు కనుమూరి కోటేశ్వరరావు, మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు కందుల జార్జి, తెదేపా మండల పార్టీ ఉపాధ్యక్షుడు కంభంపాటి రమేష్‌లు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పి జె విలియమ్స్ గతంలో ముప్పాళ్ళ ,సత్తెనపల్లి మండల అభివృద్ధి కార్యాలయాల్లో సూపరిండెంట్గా పనిచేశారు. అనంతరం ఆయన ఎంపీడీవో గా పదోన్నతి పొంది అచ్చంపేట, మంగళగిరి ప్రాంతాల్లో విధి నిర్వహించి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా విలియమ్స్ ను పలు రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు ,సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

# జంగాలపల్లిలో “స్వచ్ఛత హీ సేవ”



**నూజెండ్ల, మేజర్ న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య తెలిపారు. మంగళవారం జంగాలపల్లి గ్రామపంచా యతీలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని. ఈ కార్యక్రమంలో ఐటిసి- చర్చ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడకం నిషేధం స్లొగన్స్ ను విద్యార్థులచే పలికించడం జరిగిందని ప్రజల ప్రాణాలకు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధం లో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలో దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం వలన వచ్చే అనర్థాలను వారికి వివరించి ప్లాస్టిక్ సంచులు వాడవద్దని అలా వాడిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులచే మానవహారం నిర్వహించి స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేయించడంజరిగినది. అనంతరం రోడ్ల పక్కన గల చెత్తను క్లాప్ మిత్రుల ద్వారా తొలగించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్ శాండిల్, డిజిటల్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి, వీఆర్వో కరిముల్లా, ఉపాధ్యాయులు అజయ్ కుమార్, విజయలక్ష్మి,అనురాధ, నాగాంజనేయులు, ఐటీసీ సిబ్బంది ఏసోబు,సతీష్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్ నిర్మలాదేవి పాల్గొన్నారు.

## నూతన ఎండిఓ ను సన్మానించిన టిడిపి శ్రేణులు



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండలం పరిషత్ డెవలప్మెంట్ అధికారి పి. శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. నూతనంగా ఎంపీడీవో బాధ్యత స్వీకరించిన శ్రీనివాసరావును మాచవరం మండలం టిడిపి శ్రేణులు దుశ్శాలవాలతో ఘనంగా సన్మానించారు. ఎండిఓ ను సన్మానించిన వారిలో వైస్ ఎంపీపీ చండ్లగుండ్ల లక్ష్మయ్య(స్వామి), పిల్లుట్ల సర్పంచ్ ఎల్.శివ పార్వతి సాంబశివరావు, టీడీపి మాజీ మండల కన్వీనర్ లు యడ్లపల్లి రామారావు, కొల్లి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ చల్లపల్లి నరసింహారావు, టిడిపి సీనియర్ నాయకులు మాలపాటి మల్లయ్య, మండల ఎస్సిసెల్ అధ్యక్షులు కాశీ మాల సౌరిబాబు, టిడిపి సీనియర్ ఆర్యవైశ్య నాయకులు చిటీప్రోలు నరసింహారావు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు పుసులూరి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోండి



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండల సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి జే. శివా యాదవ్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సాధారణ సమావేశానికి హాజరు కానీ అధికారులపై ఉన్నత అధికారులకు తెలియజేయాలని ఆయన అన్నారు. అందరూ అధికారులు సమావేశనానికి వచ్చినట్ల యితే ప్రజాప్రతినిధుల సమస్యలను తెలుసుకో వడానికి అవకాశం ఉంటుంది అని ఆయన అన్నారు. పిల్లుట్ల సర్పంచ్ ఎల్ శివ పార్వతి సాంబశివరావు మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు మాచవరం మండలంలో ప్రభుత్వం భూమిని కొంతమంది ఆన్లైన్లో ఎక్కించుకొని బ్యాంకులు , సొసైటీ ద్వారా లోన్లు తీసుకున్నారని ఆయన అన్నారు. రెవిన్యూ అధికారులు సర్వే చేసి అక్రమంగా పొలాలను పేర్లు తొలగించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చల్లగుండ్ల లక్ష్మయ్య, మండల కో ఆప్షన్ మెం బర్ షేక్ మహమ్మద్ జానీ, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని కే రామమ్మ, ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఈ ఓ ఆర్ డి డి వెంగళరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం సురేష్ టిడిపి మాజీ మండల కన్వీనర్ , కొల్లి కృష్ణమూర్తి,ఈవిధ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకరికి వీడ్కోలు.. మరొకరికి స్వాగతం

### ఉద్యోగుల బదిలీలలో ఉద్వేగభరిత క్షణాలు - మునిసిపల్ టీపీఎస్‌గా కె.సునీతకు సన్మానం



**సత్తెనపల్లి రూరల్ , మేజర్ న్యూస్ :** సత్తెనపల్లి మునిసిపల్ కార్యాలయంలో టీపీఎస్ గా విధులు నిర్వహిస్తున్న పి రాఘవరావు పొన్నూరు మున్సిపాల్టీకి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా మంగళవారం నాడు కౌన్సిల్ హాల్లో బదిలీపై వెళ్తున్న టీపీఎస్ ను పురపాలక శాఖ మునిసిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ ఆద్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. టీపీఎస్ రాఘవరావు మాట్లాడుతూ సహృదయ వాతావరణంలో ఇప్పటిదాక తోటి ఉద్యోగస్తులందరము కలిసి మెలసి ఉన్నామన్నారు. నూతనంగా చీరాల నుండి సత్తెనపల్లికి వచ్చిన టిపిఎస్ కె సునీతను అధికారులు కలసి అభినందించారు. ఈ విధంగా ఒకే వేదికపై ఒక ఉద్యోగికి వీడ్కోలు పలుకుతూ ,మరో ఉద్యోగికి స్వాగతం పలికిన దృశ్యం ఉద్వేగ భరితంగా మారింది.

## జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎస్.వి.ఎస్.సి. విద్యార్థులు

**నూజెండ్ల, మేజర్ న్యూస్ :** ఎస్ జి ఎఫ్ ఐ సెలక్షన్స్ లో భాగంగా మన వినుకొండ నియోజకవర్గం స్థాయి నుండి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయిన నూజెండ్ల మండలం సీతారామపురం గ్రామం లోనీ ఎస్.వి.ఎస్.సి హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిష్ట్లా కామేశ్వర రావు శర్మ, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ మరియు పాఠశాల సిబ్బంది తమ యొక్క అభినంద నలను ఎంపిక అయిన విద్యార్థులకు తెలియజేశారు. అండర్- 17 కబడ్డీ గర్ల్స్‌లో గోపిశెట్టి లక్ష్మీ ప్రసన్న మరియు దుపాటి శ్రావణి , అండర్ -14 గర్ల్స్ లో గుమ్మ లోకేశ్వరి, అండర్ -14 బాయ్స్ లో బొడ్డపాటి ప్రవీణ్ కుమార్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యారు.

# భారత్‌లో జమిలీ ఎన్నికలు సాధ్యం కాదు : తులసీరెడ్డి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

భిన్నత్వంలో ఏకత్వం గల సమాఖ్య వ్యవస్థ కొనసాగుతున్న భారతదేశంలో జమిలీ ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని, అవశ్యకత లేదని రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్. తులసీ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీన జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో జమిలీ ఎన్నికలు అవసరమా? సాధ్యమా? అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డా! ఎన్.తులసీ




రెడ్డి ప్రసంగిస్తూ జమిలీ ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తుందని, స్థానిక సమస్యల ప్రాధాన్యతలు తగ్గుతాయని, అవినీతి తారా స్థాయికి చేరుతుందని వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలలో 500 లక్షల కోట్లు బడ్జెట్లలో వ్యయం చేస్తుంటే అందులో ఎన్నికల కోసం 10 వేల కోట్లు అనేది కేవలం 0.01 శాతం మాత్రమే అని తెలిపారు. చర్చా గోష్టిలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రముఖ విద్యావేత్త మేకల రవీంద్రబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

## ఐదవ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం



**మాచర్ల, మేజర్ న్యూస్ :** స్థానిక శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మాచర్ల పట్టణం లోని ఐదవ వార్డులోని ఫైర్ స్టేషన్ సచివాలయం పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఐదవ వార్డు అధ్యక్షులు పేరుపోగు దావీదు, 69 బూత్ ఇంచార్జి దేగల కమలాకర రావు,పేరుపోగు బాబురావు, మాచర్ల సురేష్, 70వ బూత్ ఇంచార్జి బొల్లెదుల లూకా,82వ బూత్ ఇంచార్జి రాములు, సచివాలయమ్ సిబ్బందితో కలసి ఇంటింటికి 100రొజులలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన పధకాలను గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో వీఆర్వో రవికుమార్, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 267 ఎకరాల చెరువులు ఆక్రమణలో ఉన్నాయి



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా వ్యాప్తంగా 226 చెరువులు ఉన్నాయి. ఇందులో 19 చెరువులు అక్రమణకు గురయ్యా యి. ఇందులో చిలకలూరిపేట నియోజకవర్గం గురించి చెప్పు కుంటే చిలకలూ రిపేట రూరల్ మండలం మురికిపూడి చెరువు అక్రమణలకు గురవుతుందని ఆరోపణలు వస్తున్నాయి. నాదెండ్ల మండలం గురిజవోలు చెరువు 90ఎకరాలు ఉంటే 80ఎకరాలు అక్రమణకు గురవుతుంది. చెరువు చుట్టూ రైతులు అక్రమిం చుకుని సాగు చేస్తున్నారు. యడ్లపాడు మండల ఉప్పరపాలెం చెరువు 92 ఎకరాలు ఉంటే 12ఎకరాలు అక్రమణకు గురైంది. మరో చెరువు వంకాయలపాడు 48ఎకరాలు ఉంటే ఇందులో 10ఎకరాలు అక్రమణకు గురైంది. యడ్లపాడు మండలంలోని కారుచోల చెరువు అతిపెద్ద చెరువు ఉంటే 120 ఎకరాలు చెరువు ఉండగా ప్రస్తుతం 70ఎకరాలు అక్రమణకు గురైందని వివరాలు రావు సుబ్రహ్మణ్యం తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘనసన్మానం

**దాచేపల్లి, మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చే విధంగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిగా పేరుగాంచిన మండలంలోని నడికుడి నగర పంచాయతీకి చెందిన బొల్లంపల్లి యేసు రత్నం కు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా , ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించడం జరిగింది . మంగళవారం పిడుగురాళ్ల పట్టణంలో కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్నాథ్ , ఒంగోలు జిల్లా జడ్జి కూచిపూడి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా, ఆయనకు శాలువాలు కప్పి , పూలదండలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలుపుతూ గుర్రం జాషువా సాహితి పురస్కార్ జ్ఞాపికను బహుకరించడమైనది . ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రూత్ బెన్ని , లాయర్లు స్వర్ణలత , విజయ కుమారి , చెట్టిపోగు యేసురత్నం , కార్డ్స్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

## పంటలపై వచ్చే తెగుళ్లతో జాగ్రత్తగా ఉండాలి : ఏఈఓ అప్పారావు

**ఈపూరు మేజర్ న్యూస్ :** పంటలపై వచ్చే తెగుళ్లు చీడపీడలతో జాగ్రత్తగా ఉండాలని నివారణ కొరకు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి బండి అప్పారావు అన్నారు. మండలంలోని ఇనిమేళ్ళ,భద్రపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామసభల్లో ఏ ఈ ఓ మాట్లాడుతూ ప్రస్తుతం పంటలకు ఎటువంటి తెగుళ్లు లేవని, ముందు ముందు తెగులు నుంచి పంటలను ఎలా రక్షించుకోవాలి, అధిక దిగుబడులు ఎలా పెంచుకోవాలనే దానిపై రైతులకు వివరించారు.రైతులు వ్యవసాయ పరికరాలైన తైవాన్ స్ప్రేయర్,తార్బాల్ పట్టలు కోరినట్లు తెలిపారు.అదేవిషయాన్ని ప్రభుత్వానికి ఇండెంట్ చేయడం జరిగిందని,ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే రైతులకు అందించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆధునిక సేద్యం దిశగా 'పొలం పిలుస్తోంది'కి శ్రీకారం




**రెంటచింతల, మేజర్ న్యూస్ :** అన్నదాతకు అండగా నిలబడి వ్యవసాయాన్ని లాభ సాటి చేయాలనే ఉద్దేశంతో ఎన్డీఏ ప్రభుత్వం సంకల్పిం చిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి మంగళవారం రెంటచింతలలో మండల వ్యవసాయశాఖ శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి బ్రహ్మారెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు,రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం పోస్టర్ ను పంట చేలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికతో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తలు పొలం బాట పట్టి రైతులతో మమేకమై సాంకేతిక సేవలందిస్తామన్నారు. సాగు ఖర్చులు తగ్గించి నాణ్యమైన దిగుబడి పెంపే లక్ష్యంగా పనిచేసి నూతన విధానాలను రైతుల దరికి తీసుకెళ్ళి రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచుతామన్నారు. రైతులకు ఆధునిక, వ్యవసాయ, సాంకేతిక సమాచారాన్ని, పరిజ్ఞానాన్ని చేరువ చేయటానికి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించటం, క్షేత్ర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం, తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా రైతులను ప్రోత్సహించటం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆధునిక సేద్యం దిశగా రైతులు అడుగులు వేసేలా ప్రోత్సహించే ఈ కార్యక్రమం వారంలో రెండు రోజులు పాటు మంగళ, బుధవారాల్లో మండలంలోని రెండు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు గొంతు సుమంత్ రెడ్డి, బోడపాటి రామకృష్ణ, సిద్దయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పనులను పరిశీలించిన డీపీఎం



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ రైతులు, మహిళలు పలు రకాల మోడల్స్ వేసుకొని ఆరోగ్యం, ఆదాయం పొందుతున్నారని పల్నాడు జిల్లా డిపియం అమలకుమారి అన్నారు. ముఖ్యంగా ఏటియం మోడల్ (ఎని టైమ్ మని) నిరంతరం ఆదాయం వచ్చే మోడల్స్ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. పల్నాడు జిల్లాలో రైతులు అందరు ఈ విధమైన మోడల్స్ వేసుకొని ఆదాయం, అనందం, ఆరోగ్యం పొందాలని అమలకుమారి సూచించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో పెద్దిరెడ్డిపాలెంలో కోటేశ్వరమ్మ ఎటిఎం మోడల్, విస్స పాలెంలో వేముల నరసయ్య ఎటిఎం మోడల్స్‌ను డిపియం అమలకుమారి సందర్శించటం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఏటీఎం మోడల్‌లో దుంప జాతి కూరగాయలైన క్యారెట్ బీట్రూట్ ముల్లంగి, ఆకు జాతి కూరగాయలు గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూరలతో పాటు టమాటో, వంగ, మిరప, పండ్ల మొక్కలు పెట్టుకోవాలని సూచించారు. ఇలా పెట్టుకోవడం ద్వారా ఆ కుటుం బానికి కావలసినటువంటి అన్ని రకాల కూరగాయలు తమ ఇంట్లోనే ఆరోగ్యకరంగా పొందుకోవచ్చని అన్నారు.

## సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలి

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ,క్రిమీలేయర్ పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలి గోళ్ళ అరుణ్ కుమార్ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డిమాండ్ చేశారు. మాల మహానాడు విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరిగింది. గోళ్ళ అరుణ్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్ అంశం కేవలం అంబేద్కర్ రాసిన రాజ్యాంగంనకు తూట్లు పొడుస్తూ, కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో వచ్చిన తీర్పుగా భావిస్తూ రానున్న రోజుల్లో బిజెపికి వ్యతిరేకంగా మాలలు పని చేయాలని ఏపీలో వర్గీకరణ జిల్లాల వారీగా చేస్తానన్న చంద్రబాబు ఆలోచన విరమించుకోని, ప్రభుత్వం వారి లేఖల ద్వారా కేంద్రానికి వర్గీకరణ క్రిమిలేయర్ పై పునః పరిశీలించే విధంగా ఆయా రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు డా గోదా జాన్ పాల్ మాట్లాడుతూ ఎస్సీ లకు వున్న రిజర్వేషన్స్ విభజించాలని చూస్తున్న రాజకీయ పార్టీలు వారి హక్కులను కాలరాస్తున్నప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జి గోదాబాల,వి సి కె.పార్టీ చిలకలూరిపేట ఇన్చార్జ్ జాన్ ముత్తయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొప్పుల బాబురావు, మండల అధ్యక్షులు కులకటి ఏసోబు, మండల ఉపాధ్యక్షులు పంబ రాజేష్, ఎడ్లపాడు మండల అధ్యక్షుడు గోగులమూడి నాగార్జున, మీడియా కోఆర్డినేటర్ బత్తుల విక్రమ్, ఎడ్ల పురుషోత్తం, కుల్లి అనిల్,మండల సెక్రటరీ తుమ్మగుంట మని కుమార్, బసవయ్య, ఇండియన్ లేబర్ పార్టీ అధ్యక్షులు మూకిరి కోటి, నరసరావుపేట నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సేవా సామేలు,దార్ల రాయన్న, భూషణం, శాంతరాజు పుల్లగూర రవి,పెద్ద పరదేశి,ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన పొలం పిలుస్తుంది కార్యక్రమం : ఏవో రామమ్మ



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలోని ఆకురాజుపల్లి మరియు తురకపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయా అధికారి కె.రామమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతిని తెలుసుకోవటానికి లింగాకర్షక బుట్టలను రైతులు ఎకరానికి 4 నుంచి 8 వరకు ఏర్పాటు చేసుకొని ప్రతిరోజు గమనించినట్లయితే రెక్కల పురుగులు 8-10 ఉన్నట్లయితే పురుగుమందుల పిచికారికి చేయవలేను. పత్తి పంట కాలంలో వేప నూనెనను 2సార్లు ఇతర మందులతో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. పత్తి పంటలో పోషకాల లోపం ఉండటం వలన ఫార్ములా 4ను పిచికారి చేయవలెనని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారిని కె రామమ్మ గ్రామ వ్యవసాయ సహాయకులు షైక్ అన్వార్ బాషా మరియు గ్రామ నాయకులు,రైతులు పాల్గొనడం జరిగింది.

## దాతల సహకారం మరిచిపోలేం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** విజయవాడ వరద బాధితులను అన్ని విధాల ఆదుకోవాలి, సాధారణ జీవితా లు అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి దాతలు అందిస్తున్న సహ కారం ఎప్పటికీ మరిచిపోలే మన్నారు మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. వరద బాధితులకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే నిర్దేశించిన మొత్తం కంటే అదనంగా సాయం చేస్తున్నారన్న ఆయన అందుకు దాతలు తలో చేయి వేస్తుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విజయవాడ వరద బాధితులకు అండగా నిలుస్తూ మానుకొండవారి పాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు, అశోక కాఫీ అధినేత మున్నలూరి కుమారస్వామి రూ.లక్ష చొప్పున విరాళాలు అందించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి విరాళాలకు సంబంధించిన చెక్కుల్ని అందించారు. ఈ మేరకు వరద బాధితుల సహాయార్థం వచ్చిన రూ.2 లక్షల చెక్కులను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతున్నట్లు మంగళవారం ప్రత్తిపాటి తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు పెద్దఎత్తున దాతలు ముందు కొస్తూనే ఉన్నారని అన్నారు. బాధితుల కష్టాలను చూసిన తర్వాత చలించిపోయి ఎంతోమంది సహృదయులు తమ ఆపన్న హస్తాలు అందిస్తున్నారన్నారు.

## ఆంధ్ర రాష్ట్రం సంక్షోభంలోనూ... సంక్షేమం : షేక్ కరీముల్లా

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్రం సంక్షోభంలోనూ సంక్షేమం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా అన్నారు. మంగళవారం పట్టణం లోని స్థానిక సాంబశివ నగర్లోని 35 వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో షేక్ కరిముల్లా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కరీముల్లా మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీన పెన్షన్లు, జీతాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వాదేనన్నారు. ప్రతి ఇంటికి మేలు చేకూర్చడమే మా ప్రభుత్వం లక్ష్యం, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎస్ సుభాని మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం 100 రోజుల పాలనలో ప్రజలు 100% ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీమవరం సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తేల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ సమద్ ఖాన్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మధు మాల రవి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు కొల్లి చిన్నబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి జరీనా సుల్తానా, మిరియాల రత్నకుమారి, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొండవీరయ్య, మాజీ కౌన్సిలర్ సముద్రేశ్వరరావు, 35వార్డు అధ్యక్షులు శివకృష్ణ, శివా నాయక్, మహిళ నాయకురాలునంబూరి కనికరం ,జంగా సురేష్, కార్యం శెట్టి ప్రశాంత్, గుంటి చిన వెంకయ్య, చిట్లూరి కోటి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు,వివిధ హెూదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేరుగులపూడి. ఈ మని గ్రామాల్లో. పొలం పిలుస్తుంది




**దుగ్గిరాల,మేజర్ న్యూస్:** దుగ్గిరాల మండల పరిధిలోని పేరుగలపూడి ఈమని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమానికి దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి .శిరీష ,ఏ డి ఏ ఎన్ ఉషారాణి పాల్గొని మాట్లాడుతూ రైతాంగం అవసరం మేరకు పురుగుమందులు వాడాలని సూచించారు. వరదల వల్ల దెబ్బతిన్న పంటలకు యూరియా 25 కేజీలు, పొటాష్ 15 కేజీలు వాడాలన్నారు .ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయి చైతన్య ,ఏఈఓ రమేష్ బాబు ,సురేష్,. విఏఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శృంగార పురం గ్రామం లో ఇది మంచి ప్రభుత్వం




**దుగ్గిరాల, మేజర్ న్యూస్..** దుగ్గిరాల మండల పరిధి లో నీ.శృంగరపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొండూరు సుధారాణి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పోస్టర్స్ ను అతికించి వంద రోజులలో. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను తెలియజేశారు .అనంతరం స్వచ్ఛత హి సేవలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు అంకమయ్య ,పార్టీ సీనియర్ నాయకులు మొవ్వ చంద్రం ,రెడ్డి వెంకటరావు చాగంటి పాటీ. పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు ,సునీల్ ,పెనుమాక మహేష్, గోపి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభల నిర్వహణపై అవగాహన సదస్సు

**తెనాలి టౌన్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశానుసారం, స్వర్ణాంధ్ర ఏ2047 లో భాగంగా నిర్వహించే వార్డుసభల యందు, పురపాలక సంఘ పరిధిలో జరిపే కార్యక్రమం గురించి, స్థానిక పురపాలక సంఘ కార్యాలయం నందు, అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగింది. పట్టణం లోని అన్ని సచివాలయల సెక్రటరీ లు, నోడల్ అధికారులు, సెక్షన్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో, 25-9-24 మరియు 26-9-24 తేదీలలో నిర్వహించే వార్డు సభల్లో చర్చించవలసిన అంశాలు వివరించారు. నందు మునిసిపల్ కమీషనర్, అసిస్టెంట్ కమీషనర్,హెల్త్ ఆఫీసర్,మునిసిపల్ ఇంజనీర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్,మునిసిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## కాలేయ వ్యాధికి ఆయుర్వేదంతో సత్వర చికిత్స



**గుంటూరు (మెడికల్):** కాలేయ వ్యాధికి ఆయుర్వేదం లో సత్వర చికిత్స అందించ వచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు అన్నారు. గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్ సమీపంలోని భాష్యం రామసేతు క్యాంపస్ వెనుక ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద చికిత్సా కేంద్రం లో మంగళవారం రూ. 1000 ల విలువైన కాలేయ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలేయ వ్యాధులను ఆరంభంలోనే గుర్తిస్తే ఎలాంటి ప్రాణ హాని లేకుండా నివారించ వచ్చన్నారు. ఆయుర్వేదం మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. కేరళ కోటక్కల్ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో తమ వేంకటేశ్వర ఆయుర్వేద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వంద పడకలతో అత్యుత్తమ, నాణ్యమైన చికిత్స పంచకర్మ పద్ధతిలో అందిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ భాను కాశ్యప్ , డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ రాహుల్, మేనేజర్ మల్లీశ్వర్ పాల్గొన్నారు.






## తాడేపల్లి లో స్వర్ణాంధ్ర - 2047 విజన్ సభ: డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర -2047 విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు ఎంటీఎంసీ డిప్యూటి కమిషనర్ బి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం తాడేపల్లి నవోదయ కాలనీలోని ఎంటీఏంసీ అధ్యక్షతన స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సంబంధించిన సభ నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటి కమిషనర్ బి శ్రీకాంత్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 ప్లాన్‌పై ప్రభుత్వానికి సూచనలు, అభిప్రాయాల్ని తెలియజేసి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు ప్రజలతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడం జరుగుతోందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక మహోన్నత లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధానంలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 కోసం ప్రజలు, విజ్ఞులు, విభిన్న రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపే వ్యక్తులు, సంస్థల తరపున ప్రతినిధులు, విద్యార్థులు అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వడం ద్వారా స్వర్ణాంధ్ర




సాధనలో పాలుపంచుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలను, సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను అన్ని వార్డులలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్వో మురళి, తాడేపల్లి పట్టణ జనసేన అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, సీనియర్ నాయకులు ఇట్టా పెంచలయ్య, మాజీ కౌన్సిలర్ కేలి వెంకటేశ్వరరావు, చిన్నబోతుల చిన్న, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, గోర్ల వేణుగోపాల రెడ్డి(7 రెడ్డి), కొగంటి వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కరరావు, అన్నెం కుసుమా, అద్దంకి మురళి, జొన్నా రమేష్, 2,3,4,21,22,23 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# కాశ్మీర్ సఫ్రాన్ చాయ్ అండ్ స్నాక్స్ పార్లర్ ప్రారంభోత్సవం



**గుంటూరు,మేజర్ న్యూస్ :** గుంటూరు పొత్తూరు వారి తోట మెయిన్ రోడ్డు దావత్ బిర్యాని హెూటల్ ప్రక్కన ఈరోజు కాశ్మీర్ సఫ్రాన్ చాయ్ అండ్ స్నాక్స్ పార్లర్ ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు ఈస్ట్ శాసనసభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్ హాజరై ప్రారంభోత్సవం చేశారు. నజీర్ మాట్లాడుతూ గుంటూరు నగర అభివృద్ధికి దీటుగా ప్రజలు తినేటటువంటి విధానాలు కూడా మారుతున్న తరుణంలో సరికొత్తగా గుంటూరు నగరంలో ఎవరు, ఎప్పుడూ పెట్టనటువంటి విధంగా వివిధ రకాల తో మోక్టెల్స్ తో నీడ్స్ తో పాటు స్నాక్స్ ఏర్పాటు చేసి కాశ్మీర్ సఫ్రాన్ చాయ్ అండ్ స్నాక్స్ పేరుతో ఒక మంచి వాతావరణం లో స్నాక్స్ పార్లర్ ఏర్పాటు చేయటం జరిగిందని ముఖ్యంగా ఫ్రూట్ జ్యూస్ తో పాటు మిల్క్ షేక్, మార్క్ టైల్స్, ట్రెజర్స్ మరి ముఖ్యంగా స్నాక్స్ ఎప్పుడు వినలేనటువంటి చికెన్ సమోసా, ఎగ్ సమోసా తో పాటు అనేక రకాల ఐటమ్స్ తో విభవనమైన టేస్ట్ తో పాటు సోదరుడు గని కాశ్మీర్ సఫ్రాన్ చాయ్ అండ్ స్నాక్స్ పార్లర్ను పెట్టడం జరిగిందని ప్రతి ఒక్కరు వచ్చి టెస్ట్ చేసి ఆశీర్వదించాలని కోరారు. కాశ్మీర్ సఫ్రాన్ చాయ్ అండ్ స్నాక్స్ పార్లర్ ప్రొప్రైటర్ గని మాట్లాడుతూ అన్ని ఐటమ్స్ హైదరాబాద్ స్టైల్ లో తీసుకురావడం జరిగిందని కబాడీ, మలై, బేకరీ ఐటమ్స్ మొదలగునవి అన్ని తక్కువ ధరలో నాణ్యతలో దీటుగా కస్టమర్లకు అందించడం జరుగుతుందని, విభిన్నమైన టేస్ట్ ను ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని మరి ముఖ్యంగా గుంటూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయండి

### గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ (ఐఏఎస్)




**గుంటూరు, మేజర్ న్యూస్ :** విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఘనంగా ఎన్ఎస్ఎస్ డే ఉత్సవాలు విద్యార్థులందరూ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ(ఐఏఎస్) పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సి టీలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్) విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ(ఐఏఎస్) మాట్లాడుతూ విద్యార్థులందరూ సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సమీప ప్రాంతాల్లోని ప్రజలకు విద్య, ఆరోగ్యం, పరిసర ప్రాంతాలు, కాలుష్యం, సమస్యలను పరిష్కరించడం, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ(ఐఏఎస్)ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్మెస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్స్, అధిపతులు పాల్గొన్నారు.

## ఆర్.వి.ఆర్ లో స్వర్ణాంధ్ర ఏ1947 పోస్టర్ ఆవిష్కరణ

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** ప్రపంచ చిత్ర పటంలో ఆంధ్ర రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలపటమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు లక్ష్యమని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “స్వర్ణాంధ్ర ఏ 2047” కార్యక్రమ లక్ష్య సాధనలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “స్వర్ణాంధ్ర ఏ 2047” సాధనలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ, మహిళా సాధికారత, మెరుగైన విద్య, మేలైన వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం తదితర రంగాలలో ఆర్థిక వృద్ధి సాధనకై అన్ని వర్గాల అభిప్రాయాలను మరియు సలహాలను సూచనలను సేకరించే క్రమంలో మంగళవారం ప్రభుత్వ రెవిన్యూ అధికారులు స్థానిక చౌడవరం లోని ఆర్.వి.ఆర్ & జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: డీఎస్పీ



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** ఆటో డ్రైవర్ లు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ డిఎస్పి ఎం. రమేష్ కోరారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు రికార్డులు కచ్చితంగా ఉంచుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం సేవించి ఆటోలు నడపరాదని సూచించారు. ప్రయాణికులు, మహిళలు, వృద్ధుల పట్ల గౌరవ మర్యాదలతో ఉండవలెనని కోరారు. ఈస్ట్ ట్రాఫిక్ సిఐ ఆకుల అశోక్ మాట్లాడుతూ... ఆటో డ్రైవింగ్ అనేది ఒక గౌరవప్రదమైన వృత్తి అది. నిన్ను నీ కుటుంబాన్ని పోషిస్తుందని మరవకు అని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో మరియు ఫ్లవర్ మార్కెట్, రైల్వే స్టేషన్ మరియు ముఖ్యమైన కూడలిలో ఆటోలను రోడ్లపై ఎట్టి పరిస్థితిలో నిలుపు రాదు అని ట్రాఫిక్ రూల్స్ ని అతిక్రమించి ప్రజలకు అసౌకర్యం కలిగించరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ట్రాఫిక్ సిఐ గారైన సింగయ్య ,ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నందం అబద్దయ్య, తోట పార్ధసారధి లకు అభినందనల వెల్లువ

**మంగళగిరి,మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నందం అబద్దయ్య, ఏపీ సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన తోటపార్ధసారథిలకు అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల ప్రకటన అనంతరం మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధతో పాటు పలువురు నందం అబద్దయ్య, తోట పార్థసారథిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తనను పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారాలోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

